క్లుప్తంగా

24న దేవాంగ సంక్షేమ సంఘ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న శంకరయ్య

పొదలకూరు: ఈనెల 24వ తేదీన జిల్లా దేవాంగ సంఘ ఆవిర్భావ దినోత్సవం, కార్తీక వన భోజనాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య తెలిపారు. పొదలకూరు పట్టణంలో గురువారం ఆయన సంఘ సభ్యులతో కలిసి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మండలం వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలో పైకార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దేవాంగ మహిళలు, పిల్లలకు ఆటలు, పాటల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని దేవాంగులు తమ కుటుంబ సభ్యులతో హాజరై ఐకమత్యం చాటాల్సిందిగా కోరారు.

ప్రమాదకరంగా చెలికల రోడ్డు


బురదలో కూరుకుపోయిన స్కూల్ బస్సు

విడవలూరు : మండలంలోని చెలికల గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు పూర్తిగా లేచి పోవడంతో మట్టిరోడ్డును తలపిస్తోంది. గ్రామంలోని ప్రజలు నిత్యావసర సరుకులతోపాటు ప్రతి చిన్న అవసరానికి విడవలూరుకు రావాల్సిందే. అయితే ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆటోలు కూడా గ్రామానికి రావడం కష్టంగా మారింది. వచ్చినా ఎక్కువ డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. చెలికల రోడ్డు దుస్థితిపై స్థానికులు ఎన్నోసార్లు అధికారులు, నాయకులకు మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కాగా గురువారం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను ఇంటికి తీసుకొస్తున్న సమయంలో రోడ్డుపై బురదలో ఇరుక్కుపోయింది. దీంతో చేసేదేమి లేక స్కూల్ పిల్లలను కిందకు దించి, స్థానికుల సాయంతో అతికష్టం మీద బస్సును ముందుకు కదిలేలా చేశారు. ఎలా ఎన్నిసార్లు జరిగినా పాలకుల్లో చలనం రావడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి తమకు రోడ్డు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బస్సు కోసం వేచి ఉన్న చిన్నారులు

ఆగిన చేపల వేట.. పాపం మత్స్యకారులు


వేట సాగకపోవడంతో కోడూరు తీరంలో భద్రపరిచిన పడవలు

తోటపల్లిగూడూరు: చేపల వేట సక్రమంగా సాగకపోవడంతో మత్స్యకారుల జీవనం అందోళనకరంగా మారింది. కోడూరు పంచాయతీలోని 8 మత్స్యకార గ్రామాలతోపాటు వెంకన్నపాళెం పట్టపుపాళెంలోని సుమారు 3,200 మంది వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. కొద్ది కాలంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మత్స్య సంపద దరికి చేరడం లేదు. దీంతో ఇప్పటి వరకు అంతంతమాత్రంగా సాగుతున్న వేట పూర్తిగా తుడిచి పెట్టుకునే పరిస్థితి ఏర్పడింది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి వేటకు వెళ్లినా చేపలు దొరక్క ఖాళీ పడవులతో తిరిగి రావాల్సి వస్తోంది. చాలామంది తమ పడవులు, వలలను తీరంలో భద్రపరిచి ఇతర పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని తీరంలోని వేలాది మంది మత్స్యకారులు కోరుతున్నారు.

ఇళ్ల మంజూరుకు సర్వే


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి

బుచ్చిరెడ్డిపాళెం : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇళ్ల మంజూరు కోసం సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వేపై ఇంజినీరింగ్ సహాయకులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో సొంత ఇళ్లు లేని వారి వివరాలు యాప్ ద్వారా సేకరించాలన్నారు. ఈ సర్వే గురించి గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పెంచలయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి గ్రంథాలయం.. వసతులు ఘోరం

- ఎప్పుడు కూలుతుందో తెలియని వైనం
- కనీస వసతులు మృగ్యం
- పేరుకుపోతున్న సెస్ బకాయిలు


శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయం

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలోని గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుంది. బస్టాండ్ సెంటర్‌లోని ఏసీ సుబ్బారెడ్డి పార్క్‌లో సుమారు 40 ఏళ్ల క్రితం గ్రంథాలయం కోసం సొంత భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఏక్షణంలో అయినా కూలేలా ఉంది. స్లాబు పెచ్చులూడి పడుతుండడంతో పాఠకులు లోపల కూర్చునేందుకు బయపడుతున్నారు. వరండాకు సపోర్టుగా ఉన్న ఏకైక పిల్లర్ దెబ్బతిని విరిగిపోయేలా ఉంది. గోడలపై చెట్లు మొలిచాయి. భవనంపైన వర్షపు నీరు వెళ్లే రంధ్రాలు పూడిపోయింది. దీనివల్ల వర్షం కురిసినప్పుడు మూడు నాలుగు రోజుల వరకూ ఉరుస్తూనే ఉంటుంది. గ్రంథాలయంలో ఉండే పుస్తకాలు తడిచిపోతుండడంతో సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఓ గదిలో భద్రపరిచారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కానరాని కొత్త పుస్తకాలు

గ్రామ నడిబొడ్డున గ్రంథాలయం ఉండడంతో పాఠకులతో నిత్యం సందడిగా ఉంటుంది. ఇదిలా ఉంటే సంబంధిత అధికారులు అప్పుడప్పుడూ తనిఖీలకు వస్తున్నప్పటికీ వసతుల కల్పన విషయంలో, అదనంగా కొత్త పుస్తకాలను మంజూరు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. దీంతో గ్రంథాలయంలో ఎప్పుడో 20 ఏళ్ల క్రితం ఇచ్చిన పుస్తకాలే ఇప్పుడూ ఉన్నాయి. నాలుగు డైలీ పేపర్లు, ఒకటి రెండు వీక్లీలు మినహా కొత్త పుస్తకం ఒక్కటి కూడా కానరావడం లేదు. పాఠకులు కూర్చునేందుకు సరిపడా బెంచ్‌లు, కుర్చీలు కూడా లేవు. నాలుగు కుర్చీలు ఉంటే మిగిలిన వారంతా బయట వరండాలో కింద కూర్చుని చదువుకోవాల్సిన దుస్థితి. దీనికితోడు లైబ్రేరియన్ కూడా మనుబోలు, వెంకటాచలం మండలానికి కలిపి ఒకరే ఉండడంతో వారంలో మూడు రోజులు అక్కడ, మూడు రోజులు ఇక్కడ విధులు నిర్వహించాల్సి వస్తోంది. వసతులు కల్పించాల్సిన గ్రంథాలయ శాఖ అధికారులు నిధులు లేవంటూ దాతల సహాయంతో అదనపు పుస్తకాలు, ఫర్నీచర్ సమకూర్చుకోవాలని సలహాలు ఇస్తున్నారు. గ్రంథాలయంలో సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పన్నులేమవుతున్నాయో?

కాగా ఇంటి పన్నులో ఎనిమిది శాతం గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్నారు. మండలంలోని మనుబోలు పంచాయతీ పరిధిలో ప్రతి సంవత్సరం రూ.6 లక్షల పైచిలుకు ఇంటి పన్నులు వసూలు చేస్తారు. ఇందులో 8 శాతం అంటే సుమారు రూ.50 వేలు ఏటా గ్రంథాలయ పన్నుల రూపంలో వస్తుంది. ఇలా పంచాయతీ నుంచి గ్రంథాలయానికి రావాల్సిన బకాయిలు రూ.లక్షల్లో ఉన్నాయి. ఇంతింత పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం గ్రంథాలయంలో వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గత 30 ఏళ్లుగా గ్రంథాలయానికి చిల్లిగవ్వ ఖర్చుచేసి మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. తాము చెల్లించే పన్నులు ఏమి చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


గ్రంథాలయం గోడపై ఇలా..


దెబ్బతిన్న వరండా పిల్లర్

భయం భయంగా ఉంటుంది



గ్రంథాలయంలో తరచూ పెచ్చులూడిపడుతుడడంతో భయం భయంగా గడపాల్సి వస్తోంది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇక వర్షం వస్తే నరకమే. ఇన్ని సమస్యల మధ్య నిర్వహణ ఇబ్బందిగా ఉంటోంది. చాలా ఏళ్లుగా కొత్త పుస్తకాలు కూడా మంజూరు కావడం లేదు. భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటే బాగుంటుంది.

– అరుణ్‌కుమార్, లైబ్రేరియన్

వసతులను మెరుగుపరచాలి



గ్రంథాలయంలో వసతులు ఘోరంగా ఉన్నాయి. గదిలో కూర్చుని చదువుకోవాలంటే కనీసం అందరికీ సరిపడా కుర్చీలు కూడా లేవు. మరోవైపు ఎక్కడ పెచ్చులూడి పడుతాయోననే భయంగా ఉంది. గతంలో పోల్చుకుంటే గ్రంథాలయ పన్ను రెండింతలైంది. ప్రజల నుంచి పన్నులు భారీగా వసూలు చేస్తున్న అధికారులు వసతులు కల్పించడంలో, కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంచడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

– బొమ్మిరెడ్డి ధనుంజయరెడ్డి, పాఠకుడు

వైఎస్సార్‌సీపీ నాయకుడికి కాకాణి పరామర్శ


ఆదినారాయణను పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: మండలంలోని కట్టువపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండాల ఆదినారాయణను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆదినారాయణ ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని నెల్లూరులోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో కాకాణి ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు.

మత్స్యకార భరోసాను అమలు చేయండి

విడవలూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసాను వెంటనే అందజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కోశాధికారి కొండూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం మాట్లాడారు. ప్రతి సంవత్సరం మే నుంచి జూన్ వరకు రెండు నెలల పాటు సముద్రంలో వేట నిషేధమని, ఈ సమయంలో మత్స్యకారులు ఇళ్లకే పరిమితమై ఉంటారని తెలిపారు. దీనిని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల భృతి అందించినట్లు తెలియజేశారు. అయితే ప్రస్తుతం వేట నిషేధకాలం పూర్తయి ఐదు నెలలు పూర్తి కావస్తోందని, చంద్రబాబు ప్రకటించిన రూ.20 వేల భృతి మత్స్యకారులకు అందలేదన్నారు. అంతేకాకుండా గత రెండు నెలల నుంచి తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదని, పూట గడవడం కూడా కష్టంగా ఉందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే మత్స్యకార భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం


గంధ మహోత్సవంలో పాల్గొన్న నటుడు సుమన్

వెంకటాచలం: మండలంలోని కసుమూరు కొండపై ఉన్న హజరత్ సయ్యద్ జిందా మదార్ అలీషా ఖలందర్ బాబా గంధ మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి షర్ఫుద్దీన్ మదారి ఉరఫ్ షబ్బీర్ ఆధ్వర్యంలో మత గురువులు ఆరీఫ్ ఖాదరి మదారి, హుసైనీ చిష్టి, మగ్దూమ్ అలీషా చిష్టి ఉల్ ఖాదరిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సినీ నటుడు సుమన్ హాజరయ్యారు. గంధ మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషాన్నిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

నిమ్మ మార్కెట్‌కు కాయలు


మార్కెట్‌కు వచ్చిన కాయలు

పొదలకూరు: వారంరోజులుగా స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డుకు కాయలు సక్రమంగా రాని విషయం తెలిసిందే. ఇటీవల కురిసిన వర్షాలతో తోటలు చిత్తడిగా మారి కాయలు కోసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. దీనికితోడు వర్షాకాలంలో నిమ్మకాయల ధరలు గిట్టుబాటు అవుతున్నాయి. అయితే గురువారం యార్డుకు కాయలు వచ్చాయి. మూడురోజులుగా వర్షాలు తగ్గి ఎండ కాస్తుండడంతో నేలలు ఆరి రైతులు తోటల్లోకి వెళ్తున్నారు. దీంతో ఉన్న కాయలను కూలీల ద్వారా కోయించి మార్కెట్‌కు తరలించారు. తిరిగి మార్కెట్ కళకళలాడిందని వ్యాపారులు వెల్లడించారు. చలి పెరుగుతున్నా ఈ సీజన్‌లో ఎన్నడూ లేని విధంగా కాయల ధరలు నిలకడగా ఉన్నాయి. కిలో రూ.30 నుంచి రూ.40 వరకు ధరలు పలుకుతున్నాయి. బస్తాల లెక్కలో పరిశీలిస్తే టాప్ రూ.3 వేలు పైబడి అమ్ముడు పోతుండడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు.

భయపెడుతున్న గ్రామ సింహాలు


తోటపల్లిగూడూరులో రోడ్డుపై ఇలా..

తోటపల్లిగూడూరు: మండలంలో కుక్కల బెడద అధికమైంది. 22 పంచాయతీల్లోని 74 మజారా గ్రామాల్లో వేల సంఖ్యలో ఉన్న కుక్కలు స్థానికులను భయపెడుతున్నాయి. దీనిపై అటు మండల అధికారులు, ఇటు పంచాయతీ పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పల్లెలకు వచ్చే కొత్తవారికి గ్రామ సింహాలు చుక్కలు చూపిస్తున్నాయి. చిన్నచెరుకూరు, కొత్తపాళెం, కోడూరు, మండపం, వరిగొండ, ఈదూరు, సాలిపేట, నరుకూరు, తోటపల్లిగూడూరు గ్రామాల్లో గత నెల రోజుల్లో 35మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారు. వాటి బెడద నుంచి కాపాడాలని మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు


కొడవలూరు : రామన్నపాళెం ఎస్టీ కాలనీలో బాల్య వివాహాలపై అవగాహన

మనుబోలు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాటిని ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు శిక్ష తప్పదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని పిడూరు గ్రామం ఎస్టీ కాలనీలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు తక్కువ వయసులో వివాహం చేస్తే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మనోజ్‌కుమార్ అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అనేక అనర్థాలు

కొడవలూరు : బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉన్నాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. మండలంలోని రామన్నపాళెం ఎస్టీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో అధికంగా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల వారు రక్తహీనత తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తకు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాఫ్ జాన్, హెచ్‌ఏ వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరాల్లో పూజలు

మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ బాబా విగ్రహాలకు పుష్పాలంకరణ చేశారు. మనుబోలు గ్రామానికి చెందిన జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి సతీమణి శ్రీమతి అనసూయమ్మ వర్ధంతి సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు.

- పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి పల్లకి సేవ నిర్వహించారు.

రామన్నపాళెంలో పొలం పరిశీలన


రామన్నపాళెంలో వెదజల్లిన వరిని పరిశీలిస్తున్న ఆత్మ డీడీపీ

కొడవలూరు: మండలంలోని రామన్నపాళెంలో పొలంబడి కింద ఎంపికైన సీహెచ్ రవీంద్ర పొలాన్ని గురువారం ఆత్మ డీడీపీ శివన్నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేయడం ద్వారా వ్యయం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. రైతులు ఈ పద్ధతి ద్వారా లాభపడొచ్చని సూచించారు. అన్నదాతలు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మి, వీఏఏ ఆర్.నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యటన నేడు

కొడవలూరు: నార్తురాజుపాళెం వినాయక నగర్ గిరిజన కాలనీలో కలెక్టర్ ఓ.ఆనంద్ శుక్రవారం పర్యటిస్తారని ఏఆర్డీ సంస్థ ప్రతినిధి పావని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకొంటారన్నారు. అనంతరం స్థానిక పీఎస్సార్ కల్యాణ మండపంలో గిరిజనుల సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చిస్తారని పేర్కొన్నారు.

కాలువ నీరు వాగు పాలు

- బాగు చేస్తే చెరువుకు పుష్కలంగా నీరు
- పూడిక తొలగింపు చేపడితే మేలు


మురుగుకాలువగా మారిన చెరువు సప్లై చానల్


కాలువకు గండి పడిన దృశ్యం (ఫైల్)

పొదలకూరు: ఏటా వర్షాకాలంలో పొదలకూరు చెరువు వరవ (సప్లై చానల్) కాలువ నీరు వాగు పాలవుతోంది. ఈ కాలువ నుంచి నీరు మధ్యలోనే లేఅవుట్ మీదుగా వాగులో పడి పార్లపల్లి చెరువుకు వెళ్తోంది. పొదలకూరు, లింగంపల్లి రైతులు కాలువను బాగుచేయాలని చాలా పర్యాయాలు విజ్ఞప్తి చేశారు. జలవనరుల శాఖ అధికారులు నామమాత్రపు మరమ్మతులతో సాగదీస్తున్నారు. ఏళ్ల తరబడి కాలువ గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు కాలువగా మారిపోయింది.

250 ఎకరాలు

పొదలకూరు చెరువు వరవ కాలువ పట్టణం నడిబొడ్డున వెళ్తోంది. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది వర్షాకాలంలో నిండేందుకు పాతరోజుల్లో వరవ కాలువ ప్రధానంగా ఉపయోగపడేది. పొదలకూరు – నెల్లూరు మార్గంలో కాలువ ప్రారంభమై పట్టణంలోని పలుప్రాంతాల్లో మలుపులు తిరుగుతూ చెరువుకు చేరుకుంటుంది. పట్టణం విస్తరించి కాలువ కబ్జాకు గురైంది. వెడల్పు చాలా వరకు తగ్గిపోయిందని రైతులు అంటున్నారు.

పనులు చేపట్టాలి

కాలువకు రిపేర్లు చేస్తే చెరువులోకి నీరు చేరేందుకు అవకాశం ఉంటుంది. చెరువు నిండేందుకు వరవ కాలువ ఒక్కటే ఆధారం. ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసినా చెరువుకు నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. దీంతో ఇది నిండేందుకు కాలువపైనే ఆధారపడాల్సి వస్తోంది. భారీ వర్షాలు కురిస్తే గండ్లు పడుతున్నాయి. పూడికతో నిండిన కాలువ గుండా చెరువుకు నీరు చేరాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మూడేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు పూడిక తొలగింపు పనులను పంచాయతీ చేపట్టింది. అయితే వ్యాపారస్తులు, చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను కాలువలో పడవేయడంతో తిరిగి పూడికతో నిండిపోయి వర్షపు నీరు సజావుగా సాగడం లేదు.